# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను.
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954



పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 30 | గురువారం, 12-09-2024 | పేజీలు 04 | వెల రూ: 04/-


# సెప్టెంబర్ 17కు కొత్త పేరు పెట్టిన రేవంత్ సర్కార్..

- రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతుందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది
- రాష్ట్రవ్యాప్తంగా జాతీయ జెండాను ఆవిష్కరించే కార్యక్రమాలు చేయాలి
- అన్ని జిల్లాల్లో మంత్రులు జెండా ఎగురవేయనున్నట్లు వెల్లడి

3లో



## గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ పై దాడి

- జూనియర్ వైద్యురాలిపై రోగి సహాయకుడు దాడి
- ఆసుపత్రి సిబ్బంది, ఇతర వైద్యులు అతడిని అడ్డుకున్నారు.
- సీసీ కెమెరాలో రికార్డు



## అబార్షన్, ఎకానమీ.. ట్రంప్, కమలా హారిస్ తొలి డిబేట్‌లో ఎవరు ఆధిపత్యం వహించారు?

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన తొలి డిబేట్ ముగిసింది. నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై ఈ చర్చ తీవ్ర ప్రభావం చూపనుంది. ట్రంప్, కమలా హారిస్ మధ్య గట్టి పోటీ ఉందని పలు సర్వేలు వెల్లడించాయి. అటువంటి పరిస్థితిలో ఈ చర్చ నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఈ డిబేట్ లో కమలా హారిస్, ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు.



## లడఖ్‌లో భూభాగాన్ని చైనా సైనికులు ఆక్రమించారు

భారత్-చైనా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడంపై బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ చైనాను సరిగ్గా నిర్వహించలేదని అన్నారు. లడఖ్‌లో ఢిల్లీ సైజు అంత భూభాగాన్ని చైనా సైనికులు ఆక్రమించారని ఆరోపించారు.



## ఉద్యోగులకు అదిరే శుభవార్త

- కేంద్రం కీలక ఆదేశాలు
- ఇక డైరెక్ట్ ఖాతాలోకి పెన్షన్ డబ్బులు



## స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు

ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు..




# ఈ నెల 17 లోపు నష్ట పరిహారంపై నిర్ణయం

- పంట నష్టానికి హెక్టార్ కు రూ.25 వేలు పరిహారం
- వరదల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాము
- ఉప్పుటేరు, ఎర్ర కాలువ వరదలను నివారించేందుకు చర్యలు తీసుకుంటాము
- ఉప్పుటేరుకు రెగ్యులేటర్ నిర్మాణం విషయంలో సీరియస్‌గా పరిష్కారం ఆలోచిస్తామన్నారు.
- వరి పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేలు
- త్వరలోనే పోలవరం ప్రాజెక్టు పనులు చేపట్టి, వేగంగా పూర్తి చేస్తాం
- వరదలతో రూ.6,882 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం ప్రాథమిక అంచనా
- వ్యవసాయ శాఖకు రూ.301 కోట్లు, మత్స్యశాఖకు రూ.157.86 కోట్లు వాటిల్లినట్లు తెలిపింది
- సీఎం చంద్రబాబు ముంపుపై ఆరా

3లో



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఏలూరు లో పర్యటిస్తున్నారు. తమ్మిలేరు ను పరిశీలించిన అనంతరం ఆయన సీఆర్‌రెడ్డి కాలేజ్ ఆడిటోరియంలో వరదలకు నష్టపోయిన రైతులు, వరద బాధితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీలోపు నష్ట పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని, వరికి మాత్రం ఎకరానికి రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణంపై సీరియస్‌గా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు తెలుగుదేశం హయాంలో 72 శాతం పూర్తిచేసామని.. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరాన్ని ముంచేసారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

## వైసీపీ ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసింది



## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశంలో 70 ఏళ్లు దాటిన వయో వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భీమా వర్తింప చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్ల సమావేశంలో వివరించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దాదాపు 4.5 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. వీరంతా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వయో వృద్ధుల కోసం మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గొప్ప మానవత్వంతో కూడినదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. అలాగే ఢిల్లీ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం – 4కి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. దీంతో రానున్న ఐదేళ్లలో గ్రామీణ రహదారుల కోసం రూ. 25 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుందని చెప్పారు.



# లాడ్జి యజమానులకు అవగాహన సదస్సు

- పూర్తి వివరాలు తెలిపిన వారికే రూములు అద్దెకు ఇవ్వాలి
- అనుమానాస్పదంగా ఎవరు లాడ్జ్ లకు వచ్చిన పోలీసులకు సమాచారం అందించాలి
- మంచిర్యాల డీసీపీ భాస్కర్



మంచిర్యాల ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఐజి ఆదేశాల మేరకు బుధవారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లాడ్జీల యజమానులను పిలిపించి మంచిర్యాల డిసిపి భాస్కర్ కౌన్సిలింగ్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... మంచిర్యాల పట్టణ పరిధిలోని లాడ్జీల యజమానులను పలు సూచనలు ఇవ్వడం జరిగిందని, లాడ్జిల యందు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,గదులు అద్దెకు తీసుకునే ప్రతీ ఒక్కరి వివరాలకు సంబందించిన ఐడి కార్డు/ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకోవాలని, ప్రతీ ఒక్కరి ఫోన్ నెంబర్ తీసుకొని ఒక్కసారి అట్టి ఫోన్ నెంబర్ వారిదో కాదో సరిచేసుకోవాలని,కస్టమర్ల వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలి. లాడ్జి రిజిస్టర్ ప్రాపర్ గా మెయింటైన్ చేయాలని, రాత్రి 10 గంటల తర్వాత అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన వారికి మాత్రమే లాడ్జిలో రూమ్ లు ఇవ్వాలని వారి పూర్తి వివరాలను పోలీస్ స్టేషన్లో తెలుపాలని, అదేవిధంగా ప్రతిరోజు లాడ్జికి వచ్చిన కస్టమర్లకు సంబంధించిన పూర్తి వివరాల షీట్ ను ప్రతిరోజు సంబంధిత పోలీస్ స్టేషన్లో అప్పగించాలని, ఎవరి మీదనైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని,గదులు ఎక్కువ మందికి ఇవ్వకూడదు. ఎవరైనా మారునాయు ధాలను కలిగి ఉన్నట్లు అనుమానం వచ్చిన, చూసిన గమనించిన వెంటనే పోలీసులకు తెలుపాలన్నారు.రూమ్స్ కోసం లాడ్జిలకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు వారి నుండి ఆధార్ కార్డు, ఐడి కార్డు,తీసుకొని వారు ఏ పని కోసం వచ్చారు,ఎక్కడికి వచ్చారు అని అన్ని విషయాలు తెలుసుకున్నాకే రూమ్ లు అద్దెకు ఇవ్వాలని అన్నారు. అలా కాదని వారు ఎవరైతే మాకేంటి మాకు డబ్బులు వస్తే చాలు అనుకుని అపరిచితులకు ఎలాంటి అడ్రస్ ప్రూఫ్ లేని వ్యక్తులకి తమ ఇష్టానుసారంగా రూమ్స్ అద్దెకు ఇస్తే తరువాత లాడ్జిలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన లాడ్జిల యాజమాన్యం, నిర్వాహకుల మీద కూడా కఠిన చర్యలు తప్పవని,పూర్తి భాధ్యత లాడ్జి యజమానిదే అవుతుందని హెచ్చరించారు. యజమానులు లాడ్జిలలో పనిచేస్తున్నటువంటి మేనేజర్లు, వర్కర్ల ప్రవర్తన, వారి పనితీరుపై పర్యవేక్షణ ఉండాలని, రూమ్స్ ఇచ్చిన తరువాత అట్టి వ్యక్తులపై లాడ్జి యజమానులు ఎప్పటికప్పుడు వారిని గమనిస్తూ ఉండాలని వచ్చిన వ్యక్తులపై ఎలాంటి అనుమా నం వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ కి లేదా 100 కి కాల్ చేసి తెలుపాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న రెండు లాడ్జిలపై కేసు నమోదు చేయడం జరిగింది, వాటిని త్వరలో సీజ్ చేయడం జరుగుతుందని, లాడ్జిలలో తప్పకుండా ఫైర్ సేఫ్టీ మెజర్స్ ని పాటించాలని, మైనర్లకు, కాలేజీ విద్యార్థులకు ఎలాంటి ఆధారాలు లేకుండా వారికి రూమ్స్ ఇవ్వకూడదని, పైన తెలిపిన నిబంధనలతో కూడిన అఫిడవిట్ పై అన్ని లాడ్జిల యజమానుల సంతకం తీసుకోవడం జరిగిందని, ఎవరైనా నిబంధనలు పాటించ కుండా వారి నేర ప్రవృత్తి ఆలోచనలు మానకుండా అసాంఘిక,చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందని కేసులు నమోదు అయిన లాడ్జి లను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ బన్సీలాల్, ఎస్ఐ లు సురేష్, సనత్ కు, లాడ్జిల యజమానులు పాల్గొన్నారు.

# అర్బన్ కాలనీలో మంత్రాల కలకలం

- రాజేందర్ ఇంటి ముందు బాధితుల ఆందోళన





జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : అమ్మక్కపేట అర్బన్ కాలనీలో మంత్రాల కలకలం రేగింది... వివారాల్లోకి వెళితే.... జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలంలోని అమ్మక్కపేట అర్బన్ కాలనీలో ఉంటున్న రాజేందర్ అనే వ్యక్తి మంత్రాలు చేస్తూ అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రాజేందర్ ఇంటి ముందు బాధితులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ....చెట్లపై బట్టలు కడుతూ రోడ్లపై కొబ్బరికాయలు కోరుతున్నారని, గత కొంతకాలంగా కాలనీ వాసులు రోగాలపాలు అవుతున్నారని, బొమ్మకు మేకులను కొడుతూ కలలో తనను పిలిస్తున్నాడని బాధితురాలు తెలిపింది. రాజేందర్ ను అర్బన్ కాలనీ నుండి వెల్లగొట్టాలని గతంలో కూడా ఇలాంటివి చేస్తే అక్కడి నుండి పంపిస్తే ఇప్పుడు ఇక్కడికి వచ్చి మాంత్రాలు చేస్తున్నాడని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజేందర్ ను అదుపులోకి తీసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఖాళీగా దర్శనమిస్తున్న ఆర్ సి ఓ కార్యాలయం

- అధికారుల పాలన అంతా ఇంతేనా...?
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్

నల్గొండ జిల్లా ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : బిసి గురుకుల నల్లగొండ జిల్లా కార్యాలయంలో ఆర్ సి ఓ ఆఫీసు లో ఎవరు అందుబాటులో లేకపోవడంతో ఆర్ సి ఓ ఆఫీసు తలుపు కీ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గురుకుల విద్యానంస్థలలో సమయపాలనలో తీసుకువచ్చిన మార్పులు విద్యార్థుల కు తలనొప్పిగా మారాయని అన్నారు. అద్దె భవనాలలో వున్నా గురుకుల పాఠశాలలలో సరైనా సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే ఉదయం 7 గంటలకు పాఠశాల రూములో విద్యార్థులు ఏవిధంగా తరగతి గదిలో కూర్చోగలుగుతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉదయం 4 గంటలకు లేచి బాత్రూం ల దగ్గర క్యూలైన్లలో నిలబడాల్సి వస్తుంది. తక్షణమే సమయపాలన లో మార్పులు చేయాలని అన్నారు. ఈ




కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్ ఖమ్మంపాటి శంకర్, సన్ని , నవదీప్, విఘ్నేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన జడ్పీటీసీ

నల్గొండ ప్రతినిధి (మన వెలుగు ) సెప్టెంబర్ 11 : గుర్రంపోడ్ మండల కేంద్రం మోడల్ స్కూల్ లో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుర్రంపోడ్ జడ్పీటీసీ గాలి రవి కుమార్ రిబ్బన్ కట్ చేసి, మండల ఎం పి డి ఓ స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ తో కలిసి క్రీడా పోటీలు ప్రారంభించారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢ సంకల్పనికి నిదర్శనం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రీడారంగంలో కూడ రానించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తో పాటు మండల ఎంపీడీఓ , స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ ,పి.టీ లు, నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపూర్ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : మెట్ పల్లి మండలం పెద్దపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిసరాలు,తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు హాజరు వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించా రు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి, పెద్దాపూర్ గ్రామ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# 108 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

- నలుగురు వ్యక్తుల అరెస్ట్
- రెండు టాటా ఏసీలు, ఆటోలు సీజ్
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పి అశోక్ కుమార్





జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : జిల్లా జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తన సిబ్బందితో కలిసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిదిలోని వేములకుర్తి గ్రామంలో గల శ్రీ కీర్తన, కీర్తన పౌల్ట్రీ ఫామ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 108 క్వింటల్ పిడిఎస్ బియ్యాన్ని పట్టుకొని, రెండు టాటా ఏసిలుతో పాటు ఆటోలను సీజ్ చేసి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పేద ప్రజలకు అందకుండా పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలైన అరికట్టేందుకు నిరంతరం నిఘా పెడుతూ స్పెషల్ డ్రైవ్ లు చేస్తూ విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని అన్నారు. పేద ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పక్కదారి పట్టించిన, ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పట్టుబడిన నిందితుల వివరాలు అంకతి రాజలింగం, శ్రీ కీర్తన పౌల్ట్రీ ఫామ్, వేములకుర్తి, గంగాధర్ ,కీర్తన పౌల్ట్రీ ఫామ్ , వేములకుర్తి, కొండపల్లి ఖాన్ శెట్టి, శాంతినగర్ మెట్ పల్లి, సద్దుల సతీష్, శాంతినగర్ మెట్ పల్లి హుస్సేన్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# పార్థివ దేహాన్ని నివాళులర్పించిన హాలియా మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్



నల్గొండ ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : హాలియా మున్సిపాలిటీ స్థానిక 12వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల సోమయ్య అమ్మ కీశే ఎడ్ల అనసూర్య మంగళవారం రాత్రి మరణించాడు. వారి నివాసంలో వారి పార్థివ దేహాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. హాలియా మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డితో పాటు యూత్ కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు నకిరేకంటి సైదులు , కోటి, నరేందర్,తదితరులు పాల్గొన్నారు.

# గణేశుని నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ




నల్లగొండ ప్రతినిధి ( మన వెలుగు ) సెప్టెంబర్ 11 : హాలియా పట్టణం మూడో వార్డులోని గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సీకే యూత్ ఆహ్వాన మేరకు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ అబ్కాబ్ చైర్మెన్ యడవల్లి విజయేందర్ రెడ్డితో కలిసి గణపతిని దర్శించుకున్న నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ యం.సి కోటిరెడ్డి గణేష్ నవరాత్రి ఉత్సవాలలో సీకే యూత్ గణేష్ మండపం వద్ద గణేశుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ ని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఎమ్మెల్సీ, విజయేందర్ రెడ్డి బుధవారం అన్నదానం ప్రదానం చేసిన నామని ఆనంద్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. గణేష్ మండపం విచ్చేసిన ఎమ్మెల్సీ మరియు పెద్దలు విజయేందర్ రెడ్డి యూత్ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. తదనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్ది రాజు యాదవ్,మూడ వ వార్డ్ కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్, పట్టణ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి,మాజీ యం.పి.టి.సి గడ్డం రమణయ్య,ప్రముఖ వేత్త నామాని సుధాకర్,సీకే యూత్ అధ్యక్షులు బండి రమేష్,మరియు వార్డు సభ్యులు, సీకే యూత్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు అదిరే శుభవార్త

ఉద్యోగుల పెన్షన్ కేసుల్లో జరుగుతున్న జాప్యంపై దృష్టి సారించింది కేంద్రం ప్రభుత్వం. ఉద్యోగులకు నిర్ణీత సమయానికి పింఛన్లు జారీ అయ్యేలా చూసేందుకు చర్యలు చేపట్టింది. పెన్షన్ల మంజూరు ఆలస్యమవుతుండడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో సమస్యలు పరిష్కరించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ (వ్యయ సమన్వయ విభాగం) ఆఫీసు మెమోరండం జారీ చేసింది. సీసీఎస్ (పెన్షన్) రూల్ 2021లో పేర్కొన్న నిర్ణీత కాల వ్యవధిని అనుసరించాలని ఆదేశించింది. ఉద్యోగ విరమణ చేసిన వారికి సరైన సమయానికి పెన్షన్లు జారీ చేసేందుకు సీసీఎస్ రూల్స్ 2021లో నిర్ణీత టైమ్‌లైన్ పేర్కొన్నారని గుర్తు చేసింది.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో రిటైర్మెంట్‌కు సమీపంలోకి వచ్చిన వారికి పెన్షన్ల మంజూరుకు సంబంధించి సీసీఎస్ రూల్స్2021లో స్పష్టమైన టైమ్‌లైన్ ఏర్పాటు చేశారు.ఈ నిబంధనల ప్రకారం.. ఉద్యోగి రిటైర్మెంట్ అయ్యేందుకు ఏడాది ముందే సర్వీస్ రికార్డుల వెరిఫికేషన్, పెన్షన్ మంజూరు పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఉద్యోగ విరమణకు ఆరు నెలల ముందే సదరు ఉద్యోగి ప్రధాన కార్యాలయానికి అవసరమైన డాక్యుమెంట్లు పంపించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన హెడ్ ఆఫీస్ పెన్షన్ అకౌంటింగ్ ఆఫీసులు (%ూూాం%)లకు రిటైర్మెంటుకు నాలుగు నెలల ముందే పెన్షన్ కేసులను పంపించాలి. ఆ తర్వాత ఒక నెల రోజుల ముందే పెన్షన్ అకౌంటింగ్ ఆఫీసులు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (%ూూా%) జారీ చేసి వాటిని సెంటర్ల్ పెన్షన్ అకౌంటిగ్ ఆఫీసులకు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగి పెన్షన్, గ్రాట్యుటీని ఖరారు చేసేలోపు పదవీ విరమణ చేసే ఉన్న సందర్భంలో తాత్కాలిక పెన్షన్ల మంజూరు చేయాలని సీసీఎస్ రూల్స్ 2021 చెబుతున్నాయి. 'అన్ని సందర్భాల్లోనూ పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో చెల్లించేలా చూసేందుకు నిబంధనల ప్రకారం ఉద్యోగుల పెన్షన్ కేసులను ప్రాసెస్ చేసేందుకు టైమ్‌లైన్లను కార్యాలయాల అధిపతులకు అందించాలని పీఏఓలకు ఆదేశించడం జరిగింది.' అని ఆఫీసు మెమోరండంలో పేర్కొంది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.

# సెప్టెంబర్ 17కు కొత్త పేరు పెట్టిన రేవంత్ సర్కార్..

సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ చరిత్రలో ఎప్పుడూ గుర్తుండిపోయే రోజు. ఏళ్ల తరబడి నిజాం పాలనలో ఉన్న తెలంగాణ.. నిరంకుశత్వాన్ని తెంచుకుని ప్రజాస్వామ్యంలో కలిసిన రోజు. 1948 సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాద్ సంస్థానం.. భారతదేశంలో కలిసిన రోజు. అయితే ఈ సెప్టెంబర్ 17వ తేదీ అనేది ప్రతీ సంవత్సరం తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి దారి తీస్తూనే ఉంటుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్న సెప్టెంబర్ 17వ తేదీ విషయంలో మాత్రం.. ఈ రచ్చ తప్పడం లేదు. ఇక ఈ రోజును ఒక్కో పార్టీ ఒక్కో విధంగా జరుపుకుంటూ ఉంటుంది. దీంతో జనాలు మాత్రం ఏం చేయాలో అర్థం కాక ఈ నేపథ్యంలోనే తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఈ సెప్టెంబర్ 17 ఏర్పాట్లపై సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ రోజును తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ నిర్ణయించింది. ఈ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఇక రాష్ట్రంలోని మిగితా 32 జిల్లాల్లో కూడా మంత్రులు జెండాలు ఎగురవేసి.. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని జరపనున్నారు. ఈ క్రమంలోనే 32 జిల్లాల్లో జెండా ఆవిష్కరించే ప్రజాప్రతినిధుల పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది.గత కొన్ని ఏళ్లుగా సెప్టెంబర్ 17 నిర్వహణపై తెలంగాణలో తీవ్ర వివాదం నెలకొంటున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా పేర్కొంటూ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరిపింది.

# ఈ నెల 17 లోపు నష్ట పరిహారంపై నిర్ణయం

ఇప్పుడు పోలవరం పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో కేంద్రంతో మాట్లాడి రూ. 12 వేల కోట్లు తీసుకువచ్చామన్నారు. త్వరలోనే పోలవరం పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగా తీసుకుంటామని, వరదల వలన సాగునీటి సంఘాల ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, త్వరలోనే అవి వస్తాయని తెలిపారు. శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నానని, పెదపాడు మండలంలో లోయేరు వాగు మరమత్తులు చేపడతామని చెప్పారు. వరదల వలన నష్టపోయిన అందరినీ ఆదుకుంటామని స్పష్టం చేశారు. తాను, తన మిత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీలు (కూటమి ప్రభుత్వం) సుపరిపాలన అందిస్తామని, కౌలు రైతుల ఖాతాల్లోకి నేరు ఇన్ పుట్ సబ్సీడీ వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గతంలో బుడమేరు గండ్లు వైసీపీ ప్రభుత్వం పూడ్చలేదని, భారీ వరదలకు వాతావరణంలో మార్పులే కారణమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో బుడమేరు ఆక్రమణలు జరిగాయని, తప్పుడు రిజిస్ట్రేషన్లతో అక్రమ కట్టడాలకు అధికారులు అనుమతి ఇచ్చారని, వైసీపీ పాలనతో నకిలీ బిల్లులతో డబ్బును కాజేశారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రకృతి విపత్తుతో ప్రజలకే నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుడమేరు గండ్లు పూడ్చివేతతో విజయవాడకు వరద ఆగిందన్నారు. బోట్లు వదిలి ఏమీ తెలియనట్లు వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని, బోట్లను వదిలింది వైసీపీకి చెందినవారేనని సీఎం చంద్రబాబు అన్నారు. బ్యారేజీకి వచ్చింది అక్రమ ఇసుక వ్యాపారం చేసే బోట్లేనని స్పష్టం చేశారు. నేరాలు చేసే వ్యక్తులు ప్రజా జీవితంలో ఉంటూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మొత్తం దోచేసిందని, అప్పులు మిగిల్చిందని.. వాటిని భర్తీ చేస్తున్నామని, ఖాళీ ఖజానాతో రాష్ట్ర అభివృద్ధి ఆగిపోయిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాగా ఏలూరు పర్యటన ముగించుకుని కాకినాడ జిల్లాకు బయల్దేరారు. కిర్లంపూడిలో చంద్రబాబు పర్యటిస్తారు.

# వైసీపీ ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసింది

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సొంత ఆదాయం పెంచుకునేలా మద్యం పాలసీ తీసుకొచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం మద్యం తెచ్చిన వైసీపీ నేతలు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారని మండిపడ్డారు. నూతన మద్యం పాలసీ రూపకల్పనపై క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ పాల్గొన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు పర్యటించి ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం విధానాలపై అధికారులు ఇచ్చిన నివేదికపై మంత్రులు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.."ఏపీలో మంచి మద్యం పాలసీని త్వరలోనే తీసుకొస్తాం. అక్టోబర్-1నుంచి కొత్త విధానాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆరు రాష్ట్రాల మద్యం పాలసీలను అధ్యయనం చేస్తున్నాం. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అందించేలా పాలసీ రూపొందిస్తాం. గత వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఏపీలో గంజాయి వినియోగం బాగా పెరిగింది. జగన్ చేసిన తప్పులపై ప్రజలే మాకు రెడ్ బుక్ ఇచ్చారు. సామాన్యుల నుంచి మొదలుకుని.. చంద్రబాబు వరకూ అందర్నీ జైల్లో పెట్టించి జగన్ వేధించారు. చేసిన తప్పుల నుంచి ఆయన తప్పించుకోలేరు. కచ్చితంగా శిక్ష పడుతుంది. వైఎస్ జగన్ చేసిన అరాచకాలను ఎవ్వరూ మరచిపోలేరు.

సీఎం చంద్రబాబు 10రోజులపాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉంటూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వరద ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్లారు. విపత్కర పరిస్థితుల్లో ఇంతలా కష్టపడుతున్న మాపై జగన్ అసత్యపు ప్రచారం చేస్తున్నారు. జైల్లో ఉన్న ఖైదీని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ వెళ్లారు తప్ప వరద బాధితుల గురించి ఆయనకు అక్కర్లేదు" అని అన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి వర్మ



కాకినాడ జిల్లా పిఠాపురం సెప్టెంబర్ 11( ఆర్టిఐ ఎక్స్ప్రెస్ న్యూస్ )జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ కలిసి ఏలేరు కింద పిఠాపురం ఆయుకట్టు 40 వేల ఎకరం కలదని, ఇటీవల అకాల వర్షాలకు ఏలేరు వరద ముంపుకు పిఠాపురం నియోజకవర్గం దుస్థితిని, ముంపుకు గురైన గ్రామాలను, పంట పొలాలను ఫొటోస్ ప్రదర్శన ద్వారా చూపించడం జరిగింది. వర్మ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఏలేరు ఫేస్-2 జగన్ రద్దు చేయడం వల్ల ఈరోజు పిఠాపురం మొత్తం వరదమయం అయిందని, రైతులు రోడ్డున పడ్డారు. మరలా తిరిగి ఏలేరు ఏలేరు ఫేస్-2 శుద్ధగడ్డ కొండకాలువ ఆధునీకరణ ప్రారంభించవలసిందిగా చంద్రబాబునాయుడు ని కోరడం జరిగింది. చంద్రబాబు నాయుడు కి పిఠాపురం నియోజకవర్గం పరిస్టితిని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఠాపురంలో ఎండిపోయి పొలాలకి మీ పాదయాత్రలో రైతుల యొక్క కన్నీళ్లు చూసి మీరు 1800 కోట్లతో పురుషోత్తపట్నం నిర్మాణం చేసి పిఠాపురం రైతుల్ని రెండు పంటలు సస్యశ్యామలంగా పండించుకునే విధంగా పురుషోత్తపట్నం ఇచ్చారని గుర్తుకు చేసారు. వరదొచ్చినా, తుఫాను వచ్చినా శివారు ఆయుకట్టు అయిన మా పిఠాపురం రెండు పంటలు నష్టపోవడం జరుగుతుంది. మీరు ముఖ్యమంత్రిగా ఉండగా పిఠాపురం నియోజవర్గానికి 176 కోట్ల రూపాయలతో ఏలేరు ఫేస్-2 ఆధునీకరణ శంకుస్థాపన చేసి, పనులు శివారు గ్రామ అయినా రమణక్కపేట దగ్గర ప్రారంభించడం జరిగింది.జగన్మోహన్ రెడ్డి వచ్చి రివర్స్ టెండర్ పేరుతో ఏలేరు ఫేస్-2 ఆధునీకరణ మీరు ప్రారంభించిన వర్క్ ని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి రద్దు చేసి పిఠాపురం రైతుల్ని నట్టేట ముంచారు. అందుకే ఈరోజు ఈ వరదలు వచ్చి రైతాంగం కోట్లాది రూపాయలు పంటల నష్టపోవడం జరిగింది. అదేవిధంగా గొల్లప్రోలు ఈవీసీ కాలనీలు, ఎస్సీ కాలనీలు మొత్తం నియోజకవర్గంలో గ్రామాలన్నీ కూడా ఈరోజు జలమయం అవ్వడానికి కారణం జగన్మోహన్ రెడ్డి. ఈ అన్ని విషయాలు చంద్రబాబు నాయుడు కి తెలియజేయడం జరిగింది. తక్షణమే ఏలేరు ఫేస్-2 మీరు శంకుస్థాపన చేసి ప్రారంభించిన పనిని మరలా మీరు తిరిగి టెండర్ పిలిచి పనులు మొదలు పెట్టాలని కోరడం జరిగింది.

# సరైన పోషణ..ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలు

సరైన పోషణ..ఆరోగ్య తెలంగాణనే లక్ష్యంగా పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ప్రీ స్కూల్ ట్రైనింగ్ సిడిపిఓ అవంతి అన్నారు. బుధవారం పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని పర్లపల్లి అంగన్వాడీ సెక్టార్ పరిధిలోని పర్లపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహార పదార్థాల ప్రదర్శనను నిర్వహించి..వాటి విలువపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రీ స్కూల్ ట్రైనింగ్ సిడిపిఓ అవంతి మాట్లాడారు. పోషణ లోపం లేకుండా ఉండే గ్రామాలే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు పని చేయాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఎదుగుదల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తూ..రక్తహీనత..తక్కువ బరువును అరికట్టేందుకు పెద్ద ఎత్తున పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భిణీ స్త్రీ మొదటి రోజు నుండి బిడ్డ పుట్టిన తర్వాత 2 సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన పోషకాహార పదార్థాలు, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ప్రతినెల తల్లి, బిడ్డల బరువులు, ఎత్తులు చూసి పోషకాహార లోపం ఉన్న పిల్లలకి వైద్యాధికారుల సూచన మేరకు అదనపు పోషకాహారం అందించి..సాధారణ స్థితికి తేవడంలో అంగన్వాడీలు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం అనంతరం బాలింతలు, గర్భిణీ స్త్రీలతో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని, పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత, హెల్త్ సూపర్వైజర్ జమున, స్కూల్ టీచర్స్, ఆశాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు, సెక్టార్ అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



# రైతు ధర్నా జయప్రదం చేయండి



మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 11 ఆర్టిఐ ఎక్స్ప్రెస్ న్యూస్ అర్హులైన రైతులకు పంట రుణమాఫీ చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సెప్టంబర్ 13న కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో రైతులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుంజనూరు ఆంజనేయులు మాట్లాడుతూ మాగనూరు మండలకేంద్రం లో జరిగిన సమావేశం లో ధర్నా కరపత్రం ను విడుదలచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రైతులందరికీ 2లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డు, ఇతర నిబంధనలపేరుతో రైతులకు రుణమాఫీ చేయకుండా కాలయాపన చేయయడం సరైంది కాదన్నారు . వెంటనే రైతులందరికీ రుణమాఫి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంట పెట్టుబడికిచ్చే రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేట్ అప్పులు తెచ్చి పెట్టుబడిపెట్టుకున్నారు. వెంటనే పెట్టుబడి రైతుభరోసా సహాయం ఎకరకు 15వేలు ఇవ్వాలని అన్నారు. ఈమధ్యకురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారంగా ఎకరకు 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు భరత్ కుమార్ , వాకిటి వెంకటయ్య పి బాబు రైతులు పాల్గొన్నారు.

# అబార్షన్, ఎకానమీ.. ట్రంప్, కమలా హారిస్ తొలి డిబేట్‌లో ఎవరు ఆధిపత్యం వహించారు?

ఓటర్ల మదిలో మెదిలే అంశాలపై ఇరువురు అభ్యర్థులు తమ వాదనను వినిపించారు. బైడెన్‌తో ట్రంప్ గతంలో జరిపిన డిబేట్లను కమలా హారిస్ అధిగమించారని డెమొక్రాట్లు చెబుతుండగా, ట్రంప్ మాత్రం ఇదే తనకు జరిగిన అత్యుత్తమ డిబేట్ అని పేర్కొన్నారు. వివిధ అంశాలపై ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలు పలు వాదనలు వినిపించాయి. ఎప్పుడూ కలుసుకోని కమలా హారిస్, ట్రంప్ ఒకరినొకరు ఎలా పలకరించుకుంటారనేది ముందుగా ఆసక్తికరంగా మారింది. పోడియంపై ఉన్న ట్రంప్ దగ్గరకు వెళ్లి చేయి చాచి తనను తాను పరిచయం చేసుకున్నారు కమలా హారిస్. కమలా హారిస్ తనను తాను దూరదృష్టి గల అభ్యర్థిగా అభివర్ణించారు. చర్చ ప్రారంభ నిమిషాల్లో ట్రంప్, కమలా హారిస్ ఆర్థిక వ్యవస్థపై చర్చించారు. చిన్న స్టార్టప్ లకు గణనీయమైన రుణాలు సహా ఇటీవలి వారాల్లో తాను ప్రారంభించిన ఆర్థిక విధానాలను కమలా హారిస్ వివరించారు. అదే సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను విదేశీ పోటీ నుంచి కాపాడతానని ట్రంప్ చెప్పారు. కమలా హారిస్ వ్యాఖ్యల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. వారికి ప్రణాళిక లేదు అని కామెంట్ చేశారు. అబార్షన్ విషయంలో కూడా ఇద్దరు అభ్యర్థుల మధ్య తీవ్రంగా మాటల యుద్ధం నడిచింది. ఈ అంశంపై కమలా హ్యారిస్‌దే పైచేయి అని పలు సర్వేలు చెబుతున్నాయి. 'అమెరికాను ట్రంప్ మార్చేశారు. అబార్షన్ కు రాజ్యాంగపరమైన రక్షణలను నిలిపివేస్తూ 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. అబార్షన్ కు రాజ్యాంగబద్ధమైన హక్కును డెమొక్రాట్లు ఎప్పటి నుంచో సమర్థిస్తున్నారు.' అని కమలా హారిస్ అన్నారు. 'నేను చాలా బాగా చేశాను. అందుకు ధైర్యం కావాలి. కొన్ని రాష్ట్రాలు పుట్టిన తర్వాత పిల్లలకు అబార్షన్లకు అనుమతిస్తున్నాయి.' అని ట్రంప్ వాదించారు. ట్రంప్ చేసిన ఈ ప్రకటనపై కమలా హారిస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు కోరుకునేది ఇదేనా అని ఎమర్జెన్సీ గదుల్లో వైద్యం అందడం లేదన్నారు. తమ శత్రువులను పట్టుకునేందుకు న్యాయశాఖను ఉపయోగించుకున్నారని ట్రంప్, కమలా హారిస్ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. తాను రెండోసారి గెలిస్తే శత్రువులపై చర్యలు తీసుకుంటానని ట్రంప్ హామీ ఇచ్చారని కమలా హారిస్ తెలిపారు. 'రాజ్యాంగాన్ని రద్దు చేయబోతున్నానని బాహాటంగానే చెప్పిన వ్యక్తి గురించి ఊహించుకోండి.' అని హారిస్ అన్నారు. ఇజ్రాయెల్‌పై చర్చ సందర్భంగా ఇజ్రాయెల్-గాజా యుద్ధం అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. కమలా హారిస్ గెలిస్తే ఇజ్రాయెల్ అంతమవుతుందని ఈ సందర్భంగా ట్రంప్ అన్నారు. అదే సమయంలో ట్రంప్ వాదన తప్పని, పరిష్కారాలకు తాను మద్దతిస్తున్నానని కమలా హారిస్ అన్నారు.

# లడఖ్‌లో భూభాగాన్ని చైనా సైనికులు ఆక్రమించారు

అమెరికాలోని వాషింగ్టన్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో అమెరికా-చైనా పోటీని భారత్ చక్కగా నిర్వహించిందని మీరు భావిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ సమాధానమిచ్చారు. 'మన భూభాగంలోని 4,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చైనా దళాలు రావడం చక్కగా అనిపిస్తే.. సరిగ్గా నిర్వహించి ఉండవచ్చు. లడఖ్‌లో ఢిల్లీ అంత పరిమాణంలో ఉన్న భూమిని చైనా దళాలు ఆక్రమించుకున్నాయి. అది ఒక విపత్తు అని నేను భావిస్తున్నాను. ప్రధాని మోదీ చైనాను చక్కగా నిర్వహించారని అనుకోవద్దు.' అని రాహుల్ గాంధీ అన్నారు. ఒక పొరుగు దేశం 4,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఆక్రమిస్తే అమెరికా ఎలా స్పందిస్తుందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఏ అధ్యక్షుడైనా దానిని బాగా నిర్వహించానని చెప్పుకుంటారా అని అడిగారు. పాకిస్తాన్‌పై పీఎం మోదీ విధానాలకు రాహుల్ మద్దతు ఇచ్చారు. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌ల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, భారత్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించడమే కారణమని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. పాకిస్థాన్ దేశంలో ఉగ్రదాడులకు పాల్పడితే భారత్ సహించబోదని అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నంత కాలం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతాయని చెప్పారు. కాశ్మీర్ సమస్య రెండు దేశాలను చర్చకు దూరంగా ఉంచుతుందా అని అడిగిన ప్రశ్నకు 'లేదు'అని అన్నారు. పదేళ్లలో భారత్‌లో ప్రజాస్వామ్యం విచ్ఛిన్నమైందని, ప్రస్తుతం నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తుందని రాహుల్ గాంధీ చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని మా నుంచి దూరం చేశారని అన్నారు. అదంతా తన కళ్ల ముందే జరిగిందన్నారు. మా శాసనసభ్యులు అనూహ్యంగా బీజేపీ సభ్యులయ్యారన్నారు. దేశ ప్రజాస్వామ్యంపై దాడి జరిగిందన్నారు. బలహీనంగా మారిపోయిందని చెప్పారు. ఇప్పుడు దానిని నిలబెట్టేందుకు పోరాటం జరుగుతోందన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ పై దాడి

సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ పై దాడి జరిగింది. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో మహిళా జూనియర్ డాక్టర్‌పై రోగితో వచ్చిన వ్యక్తి దాడి చేశాడు. పక్క నుంచి వెళ్తున్న జూ.డాక్టర్ అప్రాన్ లాగి, దాడికి పాల్పడ్డాడు. అతడి బారి నుంచి ఆమెను ఇతర సిబ్బంది కాపాడారు. డాక్టర్‌పై దాడికి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో పోలీసులు వెంటనే నిందితుడ్ని అదుపులోకి తీసుకుని చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై జూనియర్ డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసిన జూ.డాక్టర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రోగి అటెండర్ ఎందుకు దాడి చేశాడో తెలియాల్సి ఉందిఇటీవల కోల్ కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనతో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. తమకు భద్రత కరవైందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో గాంధీ ఆసుపత్రి ఘటనతో వైద్యులు మరింత ఆందోళన చెందుతున్నారు.

# స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు

అమరావతి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019ఎన్నికల తర్వాత సెబ్‌ను ఏర్పాటు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానికి సంబంధించిన 12జీవోలను రద్దు చేస్తూ తాజాగా సీఎం చంద్రబాబు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. సెబ్ ఏర్పాటుకు ముందు ఎక్సైజ్ శాఖలో 6,274మంది సిబ్బంది ఉండేవారు. వారిలో 70 శాతం అంటే 4,393మందిని అప్పటి ప్రభుత్వం సెబ్ విభాగానికి కేటాయించింది. దీంతో వారంతా ఎక్సైజ్ శాఖకు అనుబంధంగా పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో వారంతా రిలీవ్ కానున్నారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దుకు ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం తెలపగా.. అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు విడుదల చేశారు. సెబ్ సిబ్బంది, వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులంతా మాతృశాఖల్లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. వీరంతా ఎక్సైజ్ కమిషనర్ నియంత్రణ, పర్యవేక్షణలో పని చేయనున్నారు. అలాగే ఐజీ ర్యాంకు కలిగిన ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు కానుంది. సెబ్‌కు కేటాయించిన ఫర్నిచర్, వాహనాలు, కంప్యూటర్లు, అద్దె భవనాలను సైతం ఎక్సైజ్ శాఖకు అప్పగించాలని ఎన్డీయే సర్కార్ ఆదేశించింది.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

దీంతో రానున్న ఐదేళ్లలో గ్రామీణ రహదారుల కోసం రూ. 25 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేయనుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 31,350 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ. 12,461 కోట్ల కేటాయించిన బడ్జెట్ ప్రతిపాదనలకు సైతం కేంద్ర మంత్రి వర్గం ఆమోదం చెప్పిందన్నారు. అదే విధంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని కేంద్రం భావిస్తుందని తెలిపారు. అందులోభాగంగా రూ.10,900 కోట్లతో పీఎం ఈ డ్రైవ్ పథకానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా 88,500 ఛార్జింగ్ స్టేషన్లకు కేంద్రం తోడ్పాటునందించనుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

# టి పిసీసీ నేతకు అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు.



చిగురుమామిడి సెప్టెంబర్,11 2024: (ఆర్టీఐ ఎక్స్ ప్రేస్ న్యూస్ ) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షునిగా నూతనంగా నియామకమైన సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వాటర్స్ లో చిగురుమామిడికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పిసిసి అధ్యక్ష పదవి చేపట్టడం పట్ల అభినందనలు తెలుపుతూ పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. మహేష్ కుమార్ గౌడ్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారి ఆధ్వర్యములో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, డిసిసి అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపిటీసీ సభ్యులు చీల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గునుకుల రాజేశ్వర్ రెడ్డి, గడ్డం అనిల్ కుమార్ లు పాల్గొన్నారు.

# కేసు పురోగతిపై నివేదికివ్వండి



న్యూఢిల్లీ: కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సెప్టెంబర్ 17లోగా సమర్పించాలని సీబీఐని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ–హాస్పిటల్ ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య కేసుపై సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును వచ్చే వారం సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. లైంగికదాడి ఘటన జరిగిన సమయం, వివరాలతో పాటు సీసీటీవీ ఫుటేజీని సీబీఐకి ఇచ్చారా లేదా అని ఈ సందర్భంగా సుప్రీం ప్రశ్నించింది. సీబీఐ ఫోరెన్సిక్ నివేదికను అందజేసిన తరువాత కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. "శాంపిల్స్ ఎవరు సేకరించారు" అనేది ఈ కేసులో ముఖ్యమైన ప్రశ్న అని, అందుకే ఎవరు సేకరించారనే విషయం నిర్ధారణైన తరువాత వచ్చే మంగళవారం తాజా రిపోర్ట్ దాఖలు చేయాలని కోరింది. ఘటన తరువాత బాధితురాలి శరీరంపై గాయాలు ఉన్నాయని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పరీక్ష జరిపిన ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను ఎయిమ్స్‌కి పంపి పరిశీలించాలని సీబీఐ నిర్ణయించిందని చెప్పారు. దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీని తాము పరిశీలిస్తున్నామని సీబీఐ పేర్కొంది. మరోవైపు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద మూడు మహిళా సీఐఎస్ఎఫ్ కంపెనీలుంటే ఒక కంపెనీకి మాత్రమే వసతులు కల్పించారని ప్రస్తావించింది.

కాగా వసతులు కల్పించామని బెంగాల్ ప్రభుత్వం చెప్పింది. మూడు వారాల తరువాత సీఐఎస్ఎఫ్‌కు సదుపాయాలు కల్పించారని కేంద్రం పేర్కొంది. మరోవైపు బెంగాల్‌లో వైద్యుల భద్రతకు తీసుకున్న చర్యలపై బెంగాల్ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసింది.

# భారత్ నిజాయితీని ప్రతిసారి అనుమానించాల్సిన పనిలేదు



భారత్ నిజాయితీని ప్రతిసారీ అనుమానించాల్సిన పనిలేదని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి కండొలిజా రైస్ అన్నారు. ప్రధాని మోడీ రష్యా పర్యటనపై ఆమె స్పందించారు. ప్రతీ ఐదు నిమిషాలకోసారి భారత్ కు అమెరికా విశ్వాసపరీక్ష పెట్టాల్సిన పని లేదన్నారు. ఆమె ఇండన్ ఎక్స్ సదస్సులో మాట్లాడారు. భారత్– అమెరికా బంధం బలపడుతోందని.. సత్సంబంధాల కోసం ఇరువైపుల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వైట్ హౌజ్ లోకి ఎవరు వచ్చినా.. భారత్ తో తమ బంధం ప్రాముఖ్యత తెలుసని అన్నారు. భారత్ భావిస్తున్నట్లు చాలా దేశాలు స్ట్రాటజీల్లో స్వయంప్రతిపత్తినిని కోరుకుంటాయన్నారు. దాంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని..కానీ ఇరు దేశాల కీలక ప్రయోజనాలే అంతిమంగా బలమైన భాగస్వామ్యానికి దారితీస్తాయన్నారు. రష్యా ఆయుధాలు పూర్తిగా జంక్ అని రైస్ విమర్శించారు. మోడీ రష్యా పర్యటనలో రక్షణ సామగ్రి గురించి చర్చ జరగలేదన్నారు. భారత్ తో రక్షణపరమైన సహకారం పెంపొందించుకోవడంలో అమెరికా నిదానంగా వ్యవహరిస్తోందని గుర్తుచేశారు. చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఉన్న రిలేషన్ గురించి మోడీకి తెలుసన్నారు. ఆ రెండు దేశాల మధ్య ఉన్న సంబంధం భారత్ కు పెద్ద సమస్యగా మారే ఛాన్స్ ఉందని తెలిపారు. రష్యా సైనికపరంగా, చైనా టెక్నాలజీ పరంగా దుకుడుగా ఉన్నాయని తెలిపారు. అందుకే, వాటిని ఎదుర్కోవడం భారత్‌కు కష్టమన్నారు. ఇకపోతే, భారత్–అమెరికా మధ్య పౌర అణుఒప్పందం జరగడంలో నాటి విదేశాంగ మంత్రి రైస్ కీలక పాత్ర పోషించారు.

# అక్టోబర్ 31 నాటికి ప్రిడేటర్ డీల్‌పై సంతకాలు



అమెరికా నుంచి అత్యాధునిక సాయుధ ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలు డీల్‌పై భారత్ ప్రయత్నాలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అక్టోబర్ 31 నాటికి సంతకాలు పూర్తి చేసేలా సన్నాహాలు మొదలుపెట్టింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఫైల్‌ను డిఫెన్స్ అక్విజేషన్ కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు తుది ధరపై అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రక్షణశాఖ వర్గాలు ఆర్థికశాఖ ఆమోదముద్ర కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. ఇది ముగిస్తే సీసీఎస్ తుది ఆమోదం లభిస్తుంది. ఈ డీల్ మొత్తం విలువ 3.1 బిలియన్ డాలర్లు. ఈ డీల్ కింద మోదీ ప్రభుత్వం మొత్తం 31 ఎంక్యూ9బీ డ్రోన్లను కొనుగోలు చేస్తోంది. వీటికి ప్రత్యేక క్షిపణులు, లేజర్ గైడెడ్ బాంబులను కూడా జనరల్ అటామిక్స్ సంస్థ సమకూర్చనుంది. ఈ మొత్తం 31 డ్రోన్లలో 16 నౌకాదళానికి, 8 సైన్యానికి, మిగిలినవి వాయుసేనకు కేటాయించనున్నారు. ఆగస్టులో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆగస్టులో అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆయన బృందానికి డ్రోన్ సామర్థ్యాలను ప్రదర్శించి చూపించారు. ఇప్పటికే పశ్చిమాసియా, అఫ్గాన్ సంక్షోభాల్లో ఈ డ్రోన్లను విరివిగా వాడారు. ముఖ్యంగా చైనాలో ఉన్న వాస్తవాధీన రేఖ వెంబడి ఇవి అవసరమని భావిస్తోంది. చాలా ఎక్కువ ఎత్తులో విహరించగలిగే ఈ డ్రోన్లు ఏకబిగిన 35 గంటలకుపైగా గాల్లో ఉండగలవు. ఇవి నాలుగు హెల్‌ఫైర్ క్షిపణులను, 450 కిలోల బాంబులను మోసుకెళ్లగలవు.

# ఆర్ఎస్ఎస్ పై రాహుల్ విమర్శలు



బీజేపీ, ఆర్ఎస్ఎస్ పై కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. లోక్ సభ ఎన్నికలకు ముందు ప్రజల్లో ఉన్న భయం ఇప్పుడు కనుమరుగైందన్నారు. మూడ్రోజుల అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ.. వర్జీనియాలోని హెర్న్‌డాన్‌లో భారతీయ ప్రవాస సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత భారతదేశంలో "కచ్చితంగా ఏదో మార్పు వచ్చింది" అని అన్నారు. భయపడే వాతావరణం మాయమైందన్నారు. "బీజేపీ, నరేంద్రమోడీ.. మీడియా, ఏజెన్సీల ద్వారా భయాన్ని వ్యాప్తి చేశారు. కానీ, సెకన్లలో అదంతా మాయమైంది. ప్లాన్ ప్రకారం చాలా డబ్బుతో ఈ భయాన్ని వ్యాప్తి చేసేందుకు వారికి సంవత్సరాలు పట్టింది. కానీ, ఒక్కసెకన్ లోనే అంతా ముగిసింది" అని అన్నారు. ఇక, ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. " నేను దీనిని పార్లమెంటులో చూస్తాను. నేను ప్రధానమంత్రిని నేరుగా చూసి.. మీ 56 అంగుళాల ఛాతి ఆలోచన, దేవుడితో ప్రత్యక్ష సంబంధం, అదంతా పోయింది, ఇది ఇప్పుడు చరిత్ర.. అని చెప్పగలను" అని రాహుల్ మోడీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్‌పై మరోసారి విమర్శలు గుప్పించారు. ఆ సంస్థ కొన్ని రాష్ట్రాలను ఇతర రాష్ట్రాల కంటే తక్కువగా చూస్తోందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఇలా చెప్పడానికి కారణం.. భారతదేశాన్ని అర్థం చేసుకోకపోవడమే అని అన్నారు. "ఆర్ఎస్ఎస్ చెప్పేది ఏమిటంటే.. కొన్ని రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల కంటే తక్కువ. కొన్ని భాషలు ఇతర భాషల కంటే తక్కువ. కొన్ని మతాలు ఇతర మతాల కంటే తక్కువ. మరియు కొన్ని వర్గాలు ఇతర వర్గాల కంటే తక్కువ. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్.. ఇలా మీరు ఎక్కడ్నుండి వచ్చిన వారైనా, మీ అందరికీ మీ చరిత్ర, సంప్రదాయం, భాష ఉన్నాయి. అవన్నీ ఎంతో ముఖ్యమైనవే. కానీ, ఆర్ఎస్ఎస్ దృష్టిలో తమిళం, మణిపురి, మరాఠీ, బెంగాలీ ఇవన్నీ నాసిరకం భాషలు" అని రాహుల్ అన్నారు. "పోరాటం అంటే ఇదే. అది పోలింగ్ బూత్ లేదా లోక్‌సభలో ముగుస్తుంది. అయితే మనం ఎలాంటి భారతదేశాన్ని కలిగి ఉండబోతున్నాం అనేదానిపై పోరాటం ఉంటుంది.

## కోచింగ్ క్లాస్‌లపై నమ్మకం లేదు.. నారాయణ మూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు



తరగతి గదిలో టీచర్లు చెప్పే పాఠాలపై శ్రద్ధ చూపని విద్యార్థులకే కోచింగ్ క్లాస్‌లు అవసరమవుతాయని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అవి తప్పుడు మార్గంగా నిలుస్తున్నాయని అన్నారు. అలాంటి వాటిపై తనకు నమ్మకం లేదన్నారు. బెంగళూరులో ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పోటీ పరీక్షల శిక్షణకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యల అంశంపై అడిగిన ప్రశ్నకు నారాయణమూర్తి స్పందించారు. "ఈ రోజుల్లో కోచింగ్ క్లాస్‌లకు వెళ్లే చాలామంది తరగతి గదిలో క్లాస్‌లను సరిగా వినని వారే. లేదా ఇంటివద్ద తల్లిదండ్రులు వారికి చదువులో సాయం చేయలేని స్థితిలోనైనా ఉండి ఉండాలి. అలాంటివారే కోచింగ్ క్లాస్‌లకు ఆసక్తి చూపుతారు. దురదృష్టవశాత్తూ మన దేశంలో బట్టీ చదువులకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాం. దీనివల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, వాస్తవిక సమస్యలను పరిష్కరించుకునే సన్నద్ధత తగ్గిపోతోంది" అని నారాయణమూర్తి సమాధానమిచ్చారు. ఎలా నేర్చుకోవాలో తెలుసుకోవడమే అసలైన విద్యావిధానమని ఆయన అభిప్రాయపడ్డారు. "ముందు దేన్నైనా పరిశీలించాలి. ఆ తర్వాత దాన్ని విశ్లేషించాలి. తర్వాత దాన్ని అన్వయించుకోవాలి. చివరకు ఫలితాన్ని ధ్రువీకరించుకోవాలి. ఇదే అసలైన విద్యా ప్రాముఖ్యత" అని నారాయణమూర్తి తెలిపారు.

## ఐఐటీ విద్యార్థి మృతిపై నిరసనలు

గువాహటి: అస్సాంలోని ఐఐటీ గువాహటిలోని హాస్టల్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇది నాలుగో మరణం కావడం గమనార్హం. ఆ విద్యార్థి మృతిపై తోటి విద్యార్థులంతా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థి చనిపోయిన విషయం తల్లిదండ్రులకు చెప్పకుండా అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది అడ్డుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్‌లో జీవితాల కంటే గ్రేడులే ముఖ్యంగా మారాయంటూ విద్యార్థులంతా క్యాంపస్‌లో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. విద్యార్థి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు చూశామని, అయినా తమను లోపలికి వెళ్లకుండా అక్కడి గార్డులు అడ్డుకున్నారని సహ విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థి మృతి గురించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చేందుకు ప్రయత్నిస్తే తమ ఫోన్లు లాక్కున్నట్లు వెల్లడించారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు చూసిన ఎనిమిది గంటల తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లో మానసిక ఆరోగ్యం, సంక్షేమ సహాయక వ్యవస్థలపై విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇక, విద్యార్థి మృతికి విద్యాసంస్థ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. మృతుడి కుటుంబసభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

## బాంబుల వర్షం కురిపించిన విమానాలు..

గాజాలో సేఫ్ జోన్‌గా చెప్పుకునే ఖాన్ యూనిస్ ప్రాంతం నెత్తురోడింది. ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడితో ఏకంగా 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. నిజానికి ఖాన్ యూనిస్ ప్రాంతాన్ని హ్యూమానిటేరియన్ ప్రాంతంగా డిక్లేర్ చేసి అక్కడ యుద్ధం వల్ల నిరాశ్రయులైన అనేకమందికి ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇలాంటి ప్రాంతంపై ఇజ్రాయెల్ ఉన్నట్లుండి సోమవారం రాత్రి వేళ విమానాల ద్వారా బాంబులు కురిపించింది. దీంతో ఆ ప్రాంతం మొత్తం శవాల దిబ్బగా మారిపోయింది. కాగా.. అక్కడ హమాస్ కమాండ్ సెంటర్ ఉందని, దానిపైనే తాము దాడి చేశామని ఇజ్రాయెల్ చెబుతుండగా.. గాజా సివిల్ డిఫెన్స్ అఫీషియల్స్ మాత్రం ఇజ్రాయెల్ దాడిలో అల్–మవాసీ క్యాంపులోని 40 మంది సాధారణ ప్రజలు మరణించారని, 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని చెబుతున్నారు. ఇక స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం.. కనీసం 4 మిసైల్ ఆ ప్రాంతాన్ని ఢీకొట్టాయని, అవి పడిన చోట దాదాపు 30 అడుగుల లోతున గుంటలు ఏర్పడ్డాయని చెబుతున్నారు. 20 టెంట్లకు పైగా మంటలంటుకున్నాయని, ఆ ప్రాంతంలో ఇప్పటికీ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మరణించిన వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని గాజా సివిల్ డిఫెన్స్ అఫీషియల్స్ చెబుతున్నారు.

## గాజా పరిస్థితులు కలచివేస్తున్నాయ్.. కాల్పుల విరమణకే మా మద్దతు

ఇజ్రాయెల్–హమాస్ భీకర యుద్ధం వల్ల గాజాలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విచారం వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా గాజాలో కాల్పుల విరమణను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సౌదీ అరేబియాలోని రియాద్‌లో భారత్ – గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) విదేశాంగ మంత్రుల తొలి సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద కార్యకలాపాలను, ఇతర దేశీయులను బంధించి అపహరించడాన్ని భారత్ వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గాజాలోని సామాన్య పౌరుల మరణాలు భారత్‌ను కలచివేస్తున్నాయని, ఆ ప్రాణనష్టాన్ని వెంటనే ఆపాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే కాల్పుల విరమణ డిమాండ్‌ను తాము వినిపిస్తున్నామని జైశంకర్ చెప్పారు. పాలస్తీనా, ఇజ్రాయెల్‌లను నిర్దిష్టంగా రెండు ప్రత్యేక దేశాలుగా గుర్తించడం ద్వారానే ఈ అశాంతికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పాలస్తీనా ప్రజలకు చేయూత అందించేందుకు భారత్ ఇప్పటికే తనవంతుగా సహాయక సామగ్రిని పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

# ఇండోనేషియాలో ఘోర ప్రమాదం.. రన్‌వేపై జారిన విమానం



ఇండోనేషియాలో ఘోర విమాన ప్రమాదం తప్పింది. సోమవారం ఇండోనేషియాలోని పపువా రీజియన్ యాపిన్ ద్వీపం నుంచి రాజధాని జయపురకు త్రిగానా ఎయిర్ కు చెందిన విమానం టేకాఫ్ అవుతుండగా అదుపుతప్పి సమీపంలోని పొదల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బందితో పాటు 42 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరు చనిపోలేదు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన ప్రమాదంపై వెంటనే స్పందించిన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసు అధికారి ఆర్ద్యాన్ యూకీ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కాగా విమాన ప్రమాదానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, ఆసియాలోనే అత్యంత చెత్త విమానయాన రికార్డును ఇండోనేషియా మూటగట్టుకుంది. ఇక్కడ ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు ప్రకృతి విపత్తులు తోడు కావడంతో ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకొంటోంది. ఇండోనేషియాలో 1945 నుంచి ఇప్పటి వరకూ వందకు పైగా విమాన ప్రమాదాలు జరగ్గా.. సుమారుగా 1300 మందికిపైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయినట్లు ఏవియేషన్ సేఫ్టీ నెట్‌వర్క్ డేటా ప్రకారం తెలుస్తోంది. ఇదిలా ఉంటే 2015లో త్రిగానా విమానం ఇదే ప్రాంతంలో కూలిపోవడంతో అందులో ఉన్న 54 మంది మరణించారు.

# తేలని బీమా ప్రీమియంల తగ్గింపు



న్యూఢిల్లీ : జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా పడింది. నవంబర్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో భేటీ అయిన 54వ జీఎస్టీ మండలి.. ఈ అంశంపై మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే భేటీలో క్యాన్సర్ ఔషధాలు, స్నాక్స్‌పై జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం వెలువడింది. కౌన్సిల్ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలన్న డిమాండ్లపై జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే నిర్ణయం వెలువడుతుందని అందరూ ఆశించారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన మండలి.. మంత్రుల బృందానికి ఆ బాధ్యతను అప్పగించింది. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందానికే ఈ బాధ్యతను కట్టబెట్టింది. కొంతమంది కొత్త సభ్యులు ఈ బృందంలో చేరతారని, అక్టోబర్ చివరి నాటికి నివేదిక సమర్పిస్తారని నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనిపై నవంబర్‌లో జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. క్యాన్సర్ ఔషధాలపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ రేటును 5 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. స్నాక్స్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి జీఎస్టీని తగ్గిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి తర్వాత జీఎస్టీ పరిహార సెస్సు కొనసాగించాలా? వద్దా? అనే అంశంపైనా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ అంశాలపైనా చర్చించినట్లు పేర్కొన్నారు.

# కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగేవాళ్లకు షాకింగ్ న్యూస్..



మనలో చాలామంది కూల్ డ్రింక్స్ ను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఇతర కాలాలతో పోల్చి చూస్తే వేసవికాలంలో కూల్ డ్రింక్స్ ను తాగడానికి మనలో చాలామంది ఆసక్తి చూపిస్తారు. అయితే కూల్ డ్రింక్స్ తాగడం వల్ల శరీరానికి నష్టమే తప్ప ఎటువంటి లాభం ఉండదు. కూల్ డ్రింక్స్ తయారీలో చక్కెరను ఎక్కువగా వినియోగిస్తారు. దీర్ఘకాలంగా కూల్ డ్రింక్స్ తాగితే అనేక ఆరోగ్య సమస్యలు వేధించే ఛాన్స్ ఉంటుంది. సోడాలు, కూల్ డ్రింక్ లకు వీలైనంత దూరంగా ఉంటే మంచిదని చెప్పవచ్చు. ఎవరైతే కూల్ డ్రింక్స్ ను ఎక్కువగా తాగుతారో వాళ్లు త్వరగా బరువు పెరిగే అవకాశాలు అయితే ఉంటాయని చెప్పవచ్చు. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగేవాళ్లు మధుమేహం బారిన పడే అవకాశాలు అయితే ఉంటాయి. కూల్ డ్రింక్స్ తాగేవాళ్లను ఇన్సులిన్ సమస్య వేధించే ఛాన్స్ అయితే ఉంటుందని చెప్పవచ్చు. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే టైప్2 డయాబెటిస్ వస్తుంది.

కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగితే శరీరానికి అవసరమైన వాటి కంటే ఎక్కువ కేలరీలు అందుతాయి. శరీరంలో ఎక్కువ మొత్తం చక్కెర చేరితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు అయితే ఉంటాయని చెప్పవచ్చు. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగేవాళ్లను దంతక్షయం సమస్య కూడా వేధించే ఛాన్స్ అయితే ఉంటుంది. కూల్ డ్రింక్స్ ఎక్కువగా తాగేవాళ్లకు పళ్లకు సంబంధించిన సమస్యలు వేధిస్తాయి. కూల్ డ్రింక్స్ ద్వారా శరీరంలో కొవ్వు శాతం పెరిగే అవకాశాలు అయితే ఉంటాయని చెప్పవచ్చు. కొవ్వు కాలేయ వ్యాధికి కారణం కావడంతో పాటు ప్రాణాలకే అపాయం కలుగుతుంది. శీతల పానీయాలలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల శరీరానికి నష్టమే తప్ప లాభం ఉండదు. కూల్ డ్రింక్స్ తరచూ తాగేవాళ్లు ఈ విషయాలను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి.

# కిస్మిస్‌లను నానబెట్టిన నీళ్లను రోజూ పరగడుపునే.. నెల రోజుల పాటు తాగండి..



కిస్మిస్‌లు తినేందుకు రుచిలో ఎంతో తియ్యగా ఉంటాయి. అందుకని వీటిని చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వీటిని తరచూ తీపి వంటకాల్లో వేస్తుంటారు.దీంతో ఆయా స్వీట్లకు చక్కని రుచి వస్తుంది. అయితే కిస్మిస్‌లతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. వీటిలో అనేక పోషకాలు ఉంటాయి. ఈ క్రమంలోనే ఒక గుప్పెడు కిస్మిస్‌లను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ కిస్మిస్ నీళ్లను పరగడుపునే తాగాలి. ఇలా నెల రోజుల పాటు చేస్తే.. అనేక లాభాలు కలుగుతాయి. మీ శరీరంలో ఊహించని మార్పులు వస్తాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1.కిస్మిస్‌లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందువల్ల వీటి నీళ్లను తాగితే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

2. కిస్మిస్‌లలో ఐరన్ బాగా ఉంటుంది. కనుక కిస్మిస్ నీళ్లను నెల రోజుల పాటు తాగితే శరీరంలో రక్తం బాగా తయారవుతుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది.

3. వీటిలో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్‌లు రాకుండా చూసుకోవచ్చు.

4. కిస్మిస్ నీళ్లను తాగితే శక్తి బాగా లభిస్తుంది. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట తగ్గుతాయి. జ్వరం త్వరగా తగ్గుతుంది. రోజూ శారీరక శ్రమ, వ్యాయామం ఎక్కువగా చేసేవారు ఈ నీళ్లను తాగితే శక్తి బాగా లభించి ఉత్సాహంగా మారుతారు. ఎంత పని చేసినా అలసిపోరు. చిన్నారులు అయితే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు.

5. కిస్మిస్ నీళ్లను తాగడం వల్ల మలబద్దకం సమస్య ఉండదు. పొట్టంతా కడిగేసినట్లు క్లీన్ అవుతుంది. గ్యాస్, కడుపులో మంట కూడా తగ్గుతాయి.

6. ఈ నీళ్లను నెల రోజుల పాటు తాగితే చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. మొటిమలు, మచ్చలు పోతాయి.

# 1 గ్లాసు 3 రోజులు తాగితే...



ఈ రోజుల్లో మారిన జీవనశైలి కారణంగా ఏదొక నొప్పితో ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరూ బాధపడుతూ ఉన్నారు. ఇలా నొప్పులు వచ్చినప్పుడు పెయిన్ కిల్లర్స్ వాడకుండా ఇప్పుడు చెప్పే పాలను తాగితే చాలా తొందరగా నొప్పుల నుండి ఉపశమనం కలుగుతుంది. ఇప్పుడు చెప్పే పాలను తయారుచేసుకోవటానికి కేవలం 3 ఇంగ్రిడియన్స్ సరిపోతాయి.అంగుళం సైజ్ అల్లం ముక్కను తీసుకొని తొక్క తీసి తురమాలి. ఆ తర్వాత 3 మిరియాలను తీసుకొని కచ్చా పచ్చాగా దంచాలి. ఇప్పుడు పొయ్యి వెలిగించి గిన్నె పెట్టి ఒక గ్లాసు పాలను పోసి దానిలో తురిమిన అల్లం, దంచిన మిరియాలను వేసి రెండు పొంగులు వచ్చేవరకు మరిగించాలి. ఆ తర్వాత ఆ పాలను వడకట్టి తాగాలి. రుచి కోసం పటికబెల్లం కలపవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు పటికబెల్లం లేకుండా తాగాలి. ఈ పాలను ఉదయం లేదా రాత్రి సమయంలో తాగవచ్చు. ఈ పాలను తాగితే మోకాళ్ళ నొప్పులు,మెడ నొప్పి,నడుము నొప్పి వంటి అన్నీ రకాల నొప్పుల నుండి ఉపశమనం కలుగుతుంది. అల్లం,మిరియాలలో ఉన్న లక్షణాలు నొప్పులను తగ్గించటానికి సహాయపడతాయి.

# వేసవిలో గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుంది..!



ప్రస్తుతం ఉన్న జీవనశైలి కారణంగా చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. రకరకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఈ వేసవి కాలంలో ఎండలంలో మండిపోతుండటంతో మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇక గోరువెచ్చని నీరుతో ఎంతో ప్రయోజనం ఉంటుందనే విషయం అందరికి తెలిసిందే. అయితే వేసవిలో గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉంటుందనే విషయం అందరికి తెలియకపోవచ్చు. ఈ నీరు తాగాలని వైద్య నిపుణులు కూడా సిఫార్స్ చేస్తుంటారు. అయితే వేసవిని పరిగణలోకి తీసుకుంటే గోరువెచ్చని నీటితో దాహం తీర్చడం అసాధ్యం అనిపిస్తుంది. మలబద్ధకం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. గోరువెచ్చని నీరు తాగడం వల్ల మంచి ప్రయోజనాలున్నాయి.

రక్తనాళాలకు విస్తరిస్తుంది. రక్తప్రసరణ మెరుగు పర్చేలా చేస్తుంది. ఇది కండరాలు నొప్పిని తగ్గించేందుకు సహాయపడుతుంది. అందుకే సాధారణంగా కండరాలు, లేదా కండరాల నొప్పి ఉంటే గోరువెచ్చని నీరు తాగడం వల్ల ఎంతో ఉపశమనం లభిస్తుంది. 2003లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. భోజనానికి ముందు 500 మి.లీ నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ 30 శాతం మెరుగు పడుతుందని పరిశోధకులు గుర్తించారు.

గోరువెచ్చని నీటి వల్ల సాధారణ ఫ్లూ, జలుబుతో పోరాడుతుంది. సైనస్ సమస్యలతో బాధపడేవారికి ఇది త్వరగా ఉపశమనం కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం.. గోరువెచ్చని నీరు తాగడం వల్ల మన శరీరానికి చాలా రకాలుగా మేలు జరుగుతుందని బెంగళూరులోని బన్నెరఘట్ట రోడ్‌లోని ఫోర్టిస్ ఆస్పత్రి చీఫ్ డైటీషియన్ షాలినీ అవిరండ్ తెలిపారు. ఇది జీర్ణక్రియను మెరుగు పర్చడంలో సహాయపడుతుంది. వేసవిలో ఈ గోరువెచ్చని నీరు తాగడం అనేది కొంత ఇబ్బందిగా అనిపించవచ్చు. కానీ ఏడాది పొడవున ఈ నీరు తాగే అలవాటున్న వారికి సులభంగా అనిపిస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వలన బరువు తగ్గుతారు. గోరువెచ్చని నీటిని తాగడం వలన జీవక్రియ బలపడుతుంది. అంతేకాకుండా.. శరీరంలో కొవ్వును బర్న్ చేస్తుంది. రక్తప్రసరణను సక్రమంగా నిర్వహించడంలో ఎక్కువగా సహాయపడుతుంది. శరీరంలో టాక్సిన్.. కొవ్వు పేరుకుపోవడం వలన రక్తప్రసరణ సరిగ్గా జరగదు.. శరీరంలోని అన్ని భాగాలకు రక్తం చాలా అవసరం.. రోజూ ఉదయాన్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే.. ఫిట్?గా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# వేసవి కాలంలో వేడి నీటితో స్నానం మంచిదేనా?



వేసవి కాలం వచ్చేసింది. ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు జనాలు. అయితే, ఈ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది చన్నీళ్లగా స్నానం చేస్తుంటారు. స్విమ్మింగ్ పూల్స్‌లో, బావులు, చెరువులలో ఈత కొడుతుంటారు. అయితే, కొందరు వేసవి కాలంలోనూ వేడి నీటితో స్నానం చేయడానికి ఇష్ట పడుతారు. మరికొందరు వేడి నీటి స్నానం చేయాలా? వద్దా? అని సందేహపడుతారు. ఈ నేపథ్యంలోనే మనం ఇవాళ వేసవిలో వేడి నీటితో స్నానం చేస్తే కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

కండరాల రిలీఫ్..: మనం రోజంతా పని చేయడం వల్ల కండరాల్లో నొప్పి వస్తుంది. ఒళ్లంతా పట్టేసినట్లుగా ఉంటుంది. ఇటువంటి సందర్భంలో వేడి నీటితో స్నానం చేయడం ఉత్తమం అని నిపుణులు చెబుతున్నారు. వేడి నీటితో స్నానం చేయడం వల్ల ఇది కండరాలకు రిలాక్స్ ఇస్తుంది. నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది..: వేసవి కాలంలో ఎయిర్ కండీషనర్ ఆన్ చేసి హాయిగా నిద్రపోతారు. అయితే మరుసటి రోజు తుమ్ములు, దగ్గులతో సతమతం అవుతారు. తీవ్రమైన ఆందోళన మనసులో అలజడి రేపుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందాలంటే.. వేసవి కాలంలో వేడి నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఒత్తిడి తగ్గించి, గాఢ నిద్ర పట్టాలంటే వేడి నీటితో స్నానం ఉత్తమం.చర్మాన్ని శుభ్రపరుస్తుంది..: వేడి నీరు మీ చర్మాన్ని మరింత మెరుగ్గా శుభ్రపరుస్తుంది. వేడి నీరు శ్వేద రంధ్రాలను తెరుచుకునేలా చేస్తుంది. ఈ శ్వేద రంధ్రాలు శుభ్రంగా ఉంటే.. బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్, మొటిమలు, మచ్చలు వంటి చర్మ సమస్యలు తగ్గుతాయి.



# “డెంగ్యూ వ్యాధికి” జామ ఆకులతో చెక్

ప్రకృతిలో ఉండే ప్రతీ చెట్టు, ఆకులు ,పండ్లు ఇలా ప్రకృతి ప్రసాదించిన ప్రతీ వస్తువులో మనిషి ఆరోగ్యానికి ఉపయోగపడే కారకాలు అన్నీ ఉంటాయి. వాటి గురించి తెలుసుకుంటే చాలా మంది అనేక వ్యాదుల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. జామ ఆకులు ముఖ్యంగా వ్యాధి నిరోధక కారకాలుగా పనిచేస్తాయి. లేత జామ ఆకులు కొన్ని తీసుకుని వాటిని నీటిలో మరిగించి,వడగట్టి ఆ నీటిలో కొంచం తేనే కలిపి తీసుకుంటే డెంగ్యూ వ్యాధిని రానీయకుండా నియంత్రించవచ్చు. అంతేకాదు జ్వరంతో భాద పడే వారు అనవసర మందు బిళ్ళలు వేసుకుని వాటి వలన మరొక సైడ్ ఎఫెక్ట్ తో భాధపడే కంటే ఈ ద్రావణాన్ని తిసుకుంటే జ్వరం తగ్గుతుంది. జామ ఆకుల టీ త్రాగడం వల్ల జ్వరం వలన వచ్చే వణుకు ,నొప్పులు,తగ్గుతాయి. శరీరం ఎప్పుడు ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడే రోగ నిరోధక శక్తి కూడా ఈ జామ ఆకుల టీ త్రాగడం వలన లభిస్తుంది. దంతాల సమస్యలని దూరం చేస్తుంది.రోజు పళ్ళని జామ పుల్లతో శుభ్రం చేసుకుంటే చిగుళ్ళు గట్టి పడుతాయి, దంతాలు ధృడంగా తయారవుతాయి. జామ ఆకుల టీలో ఉండే లికోపిన్ ఓరల్, ప్రోస్టేట్ , బ్రెస్ట్ క్యాన్సర్ నివారించడంలో సహాయపడుతుంది. ప్రాణాంతక క్యాన్సర్ నియంత్రించడంలో జామా దివ్యౌషధంగా ఉపయోగపడుతుంది.జామ కాయలులో ఉండే ప్రోటీన్స్, విటమిన్స్ మరే పండ్లలో కూడా ఉండదు. వేరు వేరు రకాల పండ్లలో దొరికే విటమిన్స్ అన్ని ఒక్క జామకాయలో దొరుకుతాయి. జామ చెట్టులోని ప్రతీ భాగం మనిషి ఆరోగ్యానికి అన్ని విధాలుగా ఉపయోగపడుతాయి.

# నోటిపూత ఇబ్బంది పెడుతోందా..



నోటి పూత సాధారణంగా నాలుక, చిగుళ్లు, దవడ లోపల, పెదవుల లోపల ఏర్పడతాయి. ఇవి నొప్పిని కలిగించడంతో పాటు చాలా అసౌకర్యంగా అనిపిస్తుంది. దీంతో కారంగా, వేడిగా ఏం తినాలన్నా, కాస్తా పులుపు తగిలినా తట్టుకోలేం. నోటి శుభ్రత పాటించకపోవడం, మలబద్ధకం, హార్మోన్‌లలో మార్పులు, ఎసిడిటీ, విటమిన్ బీ కాంప్లెక్స్, బీ 12 లోపం, జింక్ లోపం, విటమిన్ బీ, సీ, ఐరన్, ఇతర పోషకాల లోపాల వల్ల నోటి పుండ్లు ఏర్పడే అవకాశం ఉంది. పురుషుల కంటే ఎక్కువగా మహిళల్లో, యువతలో నోటిపుండ్లు వస్తుంటాయని ఓ పరిశోధనలో వెల్లడైంది.సమ్మర్ లో కూడా బాడీలో అధిక వేడి వల్ల తరుచూ నోటిపూత వస్తుంది. నాలుక ఎర్రగా మారడం, నాలుక కింద, బుగ్గలోపల పుండ్లు ఏర్పడుతుంటాయి. దీని వల్ల తలనొప్పి, జ్వరం, గవద బిల్లలు కూడా వచ్చే అవకాశం ఉంది. అయితే నోటిపుండ్లను తేలికగా నయం చేయవచ్చు. మౌత్ అల్సర్లకు హెూం రెమిడీస్ కంటే మెరుగైన చికిత్స లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.తేనెలో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. తేనె తీసుకోవడం వల్ల అందులో ఉండే తేమ నోటిని పొడిబారకుండా నిరోధిస్తుంది. తేనెను తీసుకుని సమస్యాత్మక ప్రాంతాల్లో రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల నొప్పి తగ్గి ఉపశమనం లభిస్తుంది. తేనెలో ఆమ్లా పౌడర్ (ఉసిరికాయతో చేసిన పొడి) కాస్త కలుపుకుని నోటి పూతపై రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. పసుపులో తేనెను కలిపి నోటిపుండ్లపై రాసుకున్నా ప్రయోజనం ఉంటుంది.నోటి పూతకి వెల్లుల్లి మంచి ఉపశమనం. వెల్లుల్లిలో యాంటి బయాటిక్ గుణాలు ఉండటం వల్ల నోటిపూతత్వరగా తగ్గిపోతుంది. వెల్లుల్లి దంచి ఆ రసంని పూతపై క్రమం తప్పకుండా రాస్తే తగ్గిపోతుంది. బియ్యం కడిగిన నీళ్లలో కాస్త పటికబెల్లం వేసి తాగినా మంచి ఫలితం ఉంటుంది. అలాగే 1/2 టీస్పూన్ త్రిఫల చూర్ణాన్నిఒక కప్పు నీటితో కలిపి డికాషన్ తయారు చేయాలి. దీనిని రోజుకు ఒక్కసారి నోటితో పుక్కిలించాలి. ఇలా చేసినా ప్రయోజనం ఉంటుంది. 8 గ్రాముల పటిక బెల్లం, ఒక గ్రాము కర్పూరం తీసుకుని వీటిని మెత్తగా పౌడర్ చేసి ఈ పొడిని నోటి పుండ్ల మీద రాస్తే మంచి ఫలితం ఉంటుంది. ఈ మిశ్రమం నోటి పుండ్ల వల్ల కలిగిన వాపులను తగ్గిస్తుందన్నారు.ఆవు నెయ్యి కూడా నోటిపూతను తగ్గిస్తుంది. అలాగే కొత్తిమీర కషాయం పుక్కిలించడం వల్ల కూడా నోటిపూత తగ్గుతుంది. గోరువెచ్చని నీటిలో కాస్త సాల్ట్ వేసి పుక్కిలించినా ఫలితం ఉంటుంది. ఫ్రెష్ కొబ్బరి నూనె నోటిపూత, పుండ్లపై అప్లై చేస్తే తొందరగా తగ్గిపోతాయి. నోటి పుండ్లతో బాధపడుతున్న వారు కలబంద రసాన్ని ప్రతిరోజూ రెండు సార్లు తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

# కండలు బాగా పెరగాలని కోరుకుంటున్నారా ?



శరీరం దృఢంగా మారాలని.. కండలు బాగా పెరగాలని.. చాలా మంది కోరుకుంటారు. అందుకనే వ్యాయామలు గట్రా చేస్తుంటారు. అయితే ఆహారం విషయంలో మాత్రం పొరపాటు చేస్తుంటారు. కండలు పెంచాలి సరే.. కానీ ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలి.. అనే విషయం చాలా మందికి తెలియదు. దీంతో వారు జంక్ ఫుడ్, చక్కెరలు, పిండి పదార్థాలు, కొవ్వులు ఉండే ఆహారాలను అధికంగా తింటుంటారు. అయితే కండలు పెంచాలంటే వాటిని కాదు.. వేరే ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

1. కండలు పెంచాలని వ్యాయామం చేసేవారు రోజూ తినేదాని కన్నా అదనంగా 300 నుంచి 500 క్యాలరీల శక్తిని ఇచ్చే ఆహారాలను తీసుకోవాలి. అంటే.. రోజూ తినే దాని కన్నా కాస్త ఎక్కువ ఆహారం తినాలన్నమాట. అది కూడా ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. అప్పుడే కండలు పెరుగుతాయి.2. ప్రతి ఒక్కరు తమ శరీర బరువు 1కిలోకు 1.5 నుంచి 2 గ్రాముల మేర ప్రోటీన్ అందేట్లు చూసుకోవాలి. అంటే 70 కిలోలు ఉన్న ఒక వ్యక్తికి కిలోకు 2 గ్రాముల ప్రోటీన్ అనుకుంటే.. 140 గ్రాములు అన్నమాట. రోజుకు ఇంత మోతాదులో ప్రోటీన్లను తీసుకోవాలి. ఇలా శరీర బరువును బట్టి రోజూ తీసుకోవాల్సిన ప్రోటీన్ల శాతాన్ని లెక్కించాలి. దీంతో శరీరానికి ప్రోటీన్లు బాగా లభిస్తాయి. దీని వల్ల కండలు పెరుగుతాయి. శరీరం దృఢంగా మారుతుంది.

3. గుడ్లు, చేపలు, చికెన్, పాలు, పాల ఉత్పత్తులు, నట్స్, విత్తనాల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావల్సిన ప్రోటీన్లను అందిస్తాయి. దీంతోపాటు వీటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. ఇవి శరీరాన్ని దృఢంగా మారుస్తాయి. కనుక వీటిని రోజూ తీసుకోవాలి. 4. తాజా పండ్లు, కూరగాయలను కూడా రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతోపాటు నెయ్యి, కొబ్బరినూనెలను కూడా తీసుకోవచ్చు. ఇవి మనకు పోషణను, శక్తిని అందిస్తాయి. శరీరం దృఢంగా మారేలా చేస్తాయి.5. కండలు బాగా పెరగాలని కోరుకునే వారు పైన తెలిపిన ఆహారాలను తీసుకోవాలి. దీంతోపాటు బరువులు ఎత్తే వ్యాయామాలు బాగా చేయాలి. దీంతో మజిల్స్ ఏర్పడతాయి. శరీరం దృఢంగా మారుతుంది. దేహ దారుఢ్యం వస్తుంది.

# యాదాద్రిలో చినజీయర్ స్వామి పెట్టిన ముహూర్తం ఫిక్స్..

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయ మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి నిర్ణయించిన సుమూహుర్తం ప్రకారం ఈ నెల 21 నుండి 28 వరకు 7 రోజులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో గీతారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 7 రోజుల పారాయణీకులతో పారాయణం, వేదపండితులతో వేదపారాయణం, పంచకుండాత్మక యాగం బాలాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.సోమవారం ఋత్విక్ వరుణం, అఖండ జ్యోతి ప్రజ్వలన, యాగశాల ప్రవేశం, కుంభ స్థాపన, వాస్తుపూజ, వాస్తుబలి, వాస్తు హెూమం, వాస్తు పర్యగ్నకరణం, శాంతిపాఠం, అవధారలు, యాగశాలలో చతుస్థానార్చన, ద్వార తోరణ, సామూహిక శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజున మహాకుంభాభిషేకం ప్రధమ ఆరాధన, ఆరగింపు తీర్థ, ప్రసాద గోష్టి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్వామి వారి ఆలయ మహాకుంభ సంప్రోక్షణ మహెూత్సవం సందర్భంగా విచ్చేయు పారాయణీకులకు, భక్తులకు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నప్రసాదం అందించనున్నట్లు చెప్పారు. మహాకుంభ సంప్రోక్షణకు సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని ఈఓ గీతారెడ్డి వెల్లడించారు.

# కుంచెలు చెప్పిన రంగుల కథలు



అక్కడ ఒకపక్క చూపు తిప్పుకోనివ్వని కళాఖండాలు, మరోపక్క సామాజిక వాస్తవాలను కళ్లకు కట్టే చిత్రాలు ... సాధారణంగా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లన్నింటిలో చేయి తిరిగిన చిత్రకారుల సృజనకు అద్దం పట్టే చిత్తరువులు దర్శనమిస్తాయి. కేరళ తిరువనంతపురం కుతుంబళంలో ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆ ఆర్ట్ గ్యాలరీ అందుకు భిన్నం. చాలా ప్రత్యేకం. అక్కడ చూపరులను కట్టిపడేసిన దజనుకు పైగా చిత్రాలను లైంగిక వేధింపుల నుంచి బయటపడిన బాలికలు, మహిళలు చిత్రించినవి కావడం విశేషం.

తిరువనంతపురం కుతుంబళం వ్యలొప్పిలి సంస్కృతి భవన్‌లో 'ఆర్ట్ మిసియా' పేరుతో ఆర్ట్‌గ్యాలరీ నిర్వహించారు. చిత్రకళ ఒక్కటే కాదు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అక్కడ జరిగాయి. 16, 17 శతాబ్దానికి చెందిన ఇటలీవాసి ఆర్ట్‌మిసియా గెంటిలిషి, తన తండ్రి స్నేహితుల ద్వారా లైంగిక వేధింపులకు గురైంది. 'ఆమె స్మృత్యర్థం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం' అని చెప్పారు ఆ కార్యక్రమ కోఆర్డినేటర్ దీపా చంద్రన్ రామ్.

అక్కడ ఓ టేబుల్ మీద ప్రత్యేకంగా కొన్ని చిత్రాలను ఏర్పాటు చేశారు. అవన్నీ లైంగిక వేధింపుల బాధితుల కుంచె నుంచి జాలువారినవే. 'వారందరిదీ ఒకే కథ. రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే మాతా–శిశుసంక్షేమ వసతి గృహాల్లో ఆసరా పొందుతున్నవారు అక్కడికి వచ్చారు. వారు సమాజం నుంచి ఎన్నో అవమానాలు, చీత్కారాలు భరించారు. దగ్గరి బంధువుల ద్వారా వేధింపులకు గురై కుటుంబం నుంచి విడిపోయి వసతిగృహాల్లో రక్షణ పొందుతారు. కొంతకాలం తరువాత తమ ఇళ్లకు తిరిగివెళ్లినా 'ఈ గుర్తింపు' వారిని మరింత వేధింపులకు గురిచేస్తుంది. ఒకసారి లైంగిక వేధింపులకు గురైన అమ్మాయితో మేము ఏదైనా చేయొచ్చు అన్న భావన చుట్టూ ఉన్న జనంలో కలుగుతుంది. దీంతో వారు మళ్లీ మరిన్ని వేధింపు అనుభవాలతో వసతిగృహాలకు చేరుకుంటున్నారు' అంటారు 'ఆర్ట్‌మిసియా' సొసైటీ ట్రెజరర్ ఆరతి.కుటుంబం, సమాజం నుంచి వేధింపులకు గురైన వారికి గౌరవంగా జీవించే హక్కు లేదా? జీవించినంత కాలం అవమానాలు, చీత్కారాలు పడాల్సిందేనా అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు బాధితులు తమ కాళ్లపై తాము నిలబడేలా ఓ సొసైటీని ఏర్పరచి,

దానిద్వారా కొన్ని ఉత్తత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేయాలని దీపా, ఆరతి, ఇతర సభ్యులు భావించారు. ఆ ఆలోచన నుంచి ఉద్భవించిందే ఈ ఆర్ట్ గ్యాలరీ. దాని ద్వారా వచ్చిన నిధులతో బాధితుల సంక్షేమం కోసం మరిన్ని ప్రణాళికలు రచించాలన్న లక్ష్యంతో ఈ సొసైటీ పనిచేస్తోంది.'రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది మహిళా చిత్రకారిణులు ఈ ఆర్ట్‌గ్యాలరీలో పాల్గొన్నారు. మహిళల స్థితిగతులు, వేధింపులు, ఇతర అనేక లోతైన విషయాలు ఆ చిత్రాల్లో దర్శనమిచ్చాయి. వారు తమ కుంచెల ద్వారా ఎన్నో కథల్ని, రంగుల కలల్ని చిత్రాలుగా మలిచి చూపించారు. ప్రేక్షకులు తమ చిత్రాలను మెచ్చుకుంటుంటే వారు పొందిన ఆనందం మాటల్లో చెప్పలేం. వంచనకు, అవమానాలకు గురైన తాము ఏడుస్తూ కూర్చోకుండా ఏదైనా సాధించగలమని ఆ మహిళలు నిరూపించారు. వారి సాధికారతకై మా వంతు సాయం చేస్తాం' అంటారు ఆరతి.